రెండు చుక్కలతో పోలియో దూరం

పోలియో రాకుండా రక్షించుకోవచ్చు..

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 3 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు చుక్కల మందు వేయడంతో పోలియో రాకుండా రక్షించుకోవచ్చని అన్నారు. ఐదేండ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యాధికారులు సహకరించాలని కోరారు. 4, 5వ తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు చుక్కల మందు వేస్తారన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎస్ సీసీ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి

డోంగ్లీలో పోలియో చుక్కలను వేస్తున్న ఎంపీటీసీ దీన్‌దయాళ్

దోమకొండ పిల్లలకు చుక్కల మందు వేస్తున్న జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, వైద్య సిబ్బంది

వొడ్డెపల్లిలో ఇటుక బట్టీ కార్మికుల పిల్లలకు చుక్కల మందు వేస్తున్న వైద్య సిబ్బంది

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 3: పోలియో మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మొదటి రోజు ఆదివారం జిల్లావ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహించారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పోలియో చుక్కల కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. తల్లిదండ్రులు తమ ఐదేండ్లలోపు చిన్నారులకు పోలియో మందు

- **మొదటి రోజు పల్స్ పోలియో సక్సెస్**
- **ఐదేండ్లులోపు చిన్నారులకు చుక్కల మందు వేయించిన తల్లిదండ్రులు**

వేయించారు. మొబైల్ వాహనాలను ఏర్పాటు చేయడంతోపాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పోలియో చుక్కలు వేశారు. ఐదేండ్లలోపు చిన్నారులందరికీ తప్పకుండా పోలియో మందు వేయించాలని అధికారులు సూచించారు. రామారెడ్డి మండలంలోని పలు పోలియో కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు రాములు సందర్శించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. బూత్‌ల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట రామారెడ్డి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్‌కుమార్, వ్యాక్సిన్ ఇన్‌చార్జి రమేశ్ తదితరులు ఉన్నారు.

తలమడ్లలో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ రాజు

మాందాపూర్‌లో వైద్య సిబ్బంది..

పిట్లంలో ..

కాచాపూర్ లో చుక్కల మందు వేస్తున్న ఎంపీపీ గాల్‌రెడ్డి

నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామంలో చుక్కల మందు వేస్తున్న ఎంపీపీ విఠల్

దేశాయిపేట్‌లో చుక్కల మందు వేస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

నిండు జీవితానికి భరోసా ఇవ్వాలి

ఆరేపల్లిలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్, మార్చి 3: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం ప్రారంభించారు. ఓ చిన్నారికి చుక్కల మందు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలియో మందు వేయించి నిండు జీవితానికి భరోసా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జయప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో పోలియో మందు వేస్తున్న రాష్ట్రపరిశీలకుడు రాములు

అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఎంపీటీసీ లక్ష్మి..



పెద్ద కొడప్‌గల్‌లో నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

జీరో బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

రాచ్చేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/డోంగ్లీ, మార్చి 3: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈమేరకు మండలంలోని ఆరేపల్లిలో ఆయన పలువురికి జీరో బిల్లులను అందజేశారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కూడా ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జయప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, ఏఈ లక్ష్మణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. డోంగ్లీ మండలంలోని ఎన్‌బురా శివారులో ఉన్న రాచ్చేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆయన కుర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన విజయోత్సవ సభలోమాట్లాడుతూ.. నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ రాజు పాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దీన్‌దయాల్, పరమేశ్ పటేల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లుల పంపిణీ

జీరో బిల్లును అందజేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 3: పట్టణంలోని ఆరో వార్డులో గృహజ్యోతి విద్యుత్ బిల్లులను ఆదివారం అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జీరో బిల్లులను అందజేస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ట్రాన్స్‌కో లైన్‌మన్ లక్ష్మీనారాయణ, నూర్య, స్థానిక నాయకులు చెన్న లక్ష్మణ్, విద్యాసాగర్, ఘయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్లకు సన్మానం

బిచ్కుంద, మార్చి 3: గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులను సాధించిన మండల వాసులను బిచ్కుంద మార్కెట్ కమిటీలో ఆదివారం సన్మానించారు. ఎంపీపీ అశోక్‌పటేల్‌తోపాటు ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ వారిని సత్కరించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బీబీపేట్, మార్చి 3 : మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని గిర్దావర్ అజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో హాజరు కావాలని కోరారు.

సంఘ భవనం ప్రారంభం

కురుమ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

దోమకొండ, మార్చి 3: దోమకొండలోని కుర్మ సంఘ భవనాన్ని ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అం తకుముందు ఆయన నల్లమారెమ్మదేవి, ముత్యాలమ్మదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు బీజేపీ నాయకులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

బోల్తాపడిన ట్రాక్టర్

ధన శ్రీను(ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 3: లింగంపేట మండలం నల్లమడుగు పెద్ద తండా గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడని తండా మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం హరితహారం మొక్కల కోసం డ్రైవర్ ధన శ్రీను (30) ట్యాంకర్‌లో నీళ్లు నింపుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో శ్రీను అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కావేరి, కుమారులు ఆదిత్య, శ్రీహాన్ ఉన్నారని మాజీ సర్పంచ్ తెలిపారు. మృతుడి భార్య కావేరి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్

భిక్కనూరు, మార్చి 3 : జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మర్రి మహిపాల్‌ను నియమితులయ్యారు. భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన మర్రి మహిపాల్ ఆదివారం జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జాతీయ చైర్మన్ ఎండీ యాసీన్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా జాతీయ మానవ హక్కుల కామారెడ్డి జిల్లా అధ్యక్షులగా నియమితులైన మహిపాల్‌ను భిక్కనూరు మండల ప్రజలు గ్రామస్తులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

మోతెలో బెల్టు దుకాణంపై దాడి

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 3: లింగంపేట మండలంలోని మోతె గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై దాడి చేసి లక్ష రూపాయల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు శనివారం రాత్రి బద్దం ప్రతాప్‌రెడ్డి ఇంటిపై దాడిచేశామని అన్నారు. ఇంట్లో నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

కుక్కల దాడిలో దూడ మృతి

రామారెడ్డి, మార్చి 3: కుక్కల దాడిలో దూడ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నర్సింహులు తన గేదె దూడను ఇంటి ముందు కట్టేశాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా గుంపుగా వచ్చి దూడపై దాడిచేసి గాయపరిచాయి. నర్సింహులు గమనించి వాటిని చెదరగొట్టాడు. అపస్మారక స్థితిలో ఉన్న దూడను ప్రభుత్వ పశువుల దవాఖానకు తీసుకెళ్లాడు. దవాఖాన మూసి ఉండడంతో వెంటనే ప్రైవేటు పశువుల దవాఖానకు తరలించాడు. ఆయన పరీక్షిస్తున్న కొద్దిసేపటికే మరణించిందని తెలిపాడు. దూడ విలువ రూ.ఐదు వేలు ఉంటుందన్నాడు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మద్నూర్, మార్చి3: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అభిషేకం, ప్రత్యేకపూజలు, హారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలువురు దాతలను సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

నాటు బాంబు పేలి మహిళకు తీవ్రగాయాలు

రామారెడ్డి, మార్చి 3: నాటుబాంబు పేలి మహిళకు గాయాలైన ఘటన మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుండగుల శిరీష ఇంట్లో నాటుబాంబు పేలింది. అది పందుల వేటకు వాడే మందుగుండు సామగ్రి అయి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేశారు. తీవ్ర గాయాలైన శిరీషను కామారెడ్డికి తరలించగా.. అక్కడ చేర్చుకోకపోవడంతో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై విజయ్‌ను వివరణ కోరగా.. తమకు సమాచారం ఉన్నదని, ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

బాన్సువాడ, మార్చి 3 : పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో పోచమ్మకు ఆదివారం బోనాలను సమర్పించారు. కాలనీవాసులు బోనాలతో వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

బాన్సువాడ రూరల్, మార్చి 3 : బీఆర్ఎస్ సంగోజీపేట్ గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన రాసాలం సాయిలును గ్రామ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో గ్రామ అధ్యక్షుడిగా నియమించిందని, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ ఉపాధ్యక్షులు రవి, బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా కిషన్‌రావు, సంయుక్త కార్యదర్శిగా గంగారాం, కోశాధికారిగా ఆకుల పోచన్న, ప్రచార కార్యదర్శిగా సాయిలు, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రావు, నారాయణ, వేణు, శ్రీరాం, కేశన్న, సాయిబాబా, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సాయిలుతో గ్రామస్తులు

ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు గడువు పొడిగింపు

నిజాంసాగర్, మార్చి 3: మండలంలోని అచ్చంపేట మోడల్ పాఠశాలలో చేరేందుకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో వంద సీట్లతోపాటు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 11వ తేదీ వరకు గడువు ఉన్నదని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హైవేపై వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పిట్లం, మార్చి 3: మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్సై నీరేశ్ ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు వెంట తెచ్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయనవెంట ఏఎస్సై లింబాద్రి, సిబ్బంది ఉన్నారు.